67)ముఖారి

ప॥ నేమే బ్రహ్మమను కోనేరము నేము- । కామించిన స్వతంత్రము గడు లేదుగాన ॥

చ॥ క్షణములోపలనె సర్వజీవావస్థలూను । గణుతించేవా డొకడు గలడు వేరే ।
అణుమహత్త్వములందు నంతర్యామైనవాని । ప్రణుతించి దాసులమై బ్రదికేముగని ॥

చ॥ పనిగొని యేలుటకు బ్రహ్మాదిదేవతల । గనిపించేవా డొకడు గలడు వేరే ।
ననిచి సిరుల లక్ష్మీనాథుడైనవాని- । పనులవారము నేము బ్రదికేముగాని ॥

చ॥ సతతరక్షకుడయి శంఖచక్రధరుడయి । గతి శ్రీవేంకటపతి గలడు వెరే ।
ఆతనిమఱుగు చొచ్చి యానందపరవశాన । బ్రతిలేక యిందరిలో బ్రదికేము గాని ॥